


కథ

# గోడ

సి.యస్. ఆర్. ప్రసాద్

ఒయాసిస్ ఇంటర్నేషనల్ కంపెనీ లెదర్ బిజినెస్‌లో వరల్డ్‌ఫేమస్. హైదరాబాద్ చుట్టు పక్కల కంపెనీలు పెట్టదలిచిన వారికి, పెట్టదల్చకపోయినా పెట్టబోతున్నాం, ఎప్పుడో అప్పుడు తప్పక పెడతాం అని ప్రాంసరీ నోటు రాస్తే చాలు వందలవేల ఎకరాలు సంతర్పణ చేస్తున్నారనే వార్తలు విన్న ఒయాసిస్ కంపెనీ తను గూడా ప్రపంచంలోకెల్లా పెద్ద లెదర్ గూడ్స్, చెప్పులు బూట్లు వగైరా ఫ్యాక్టరీ పెట్టబోతున్నాం కాబట్టి వెయ్యి ఎకరాలు కావాలని అడిగింది.

ఏ దేశంలోనైనా ఫ్యాక్టరీకి కావాల్సిన స్థలం దాని యాజమాన్యమే ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనుక్కోవాల్సి వుంటుంది. కాని హైదరాబాద్ ప్రభుత్వానికి ఇంకా నవాబు దర్జా, రాజరికపు తీవి వదల్లేదు. పేరుకి ప్రజాస్వామ్యమే అయినా ఇంకా దొరల పెత్తనమే కాబట్టి ప్రపంచంలో ఎవరు కంపెనీలు పెడదామని ముందుకొచ్చినా స్థలాన్ని సేకరించి ఇచ్చే బాధ్యత నెత్తిన వేసుకుని రైతుల నుంచి పొలాల్ని లాక్కుని కావాల్సిన వారికి కట్టబెడుతోంది.

ఆ క్రమంలో నగర శివారుల్లోని పుల్లల గూడెం గ్రామాన్ని ఖాళీ చేయించి, పొలాల్ని లాక్కుని ఒయాసిస్ ఇంటర్నేషనల్ కంపెనీకి ధారాదత్తం చేశారు. ఎన్నో వేలమందికి ఉద్యోగా లొస్తాయిని ప్రకటనలు వస్తున్నాయి గాని కంపెనీ ఎప్పుడు ఫ్యాక్టరీ కడుతుందో? అది పని ఎప్పుడు ప్రారంభిస్తుందో ఉద్యోగాలు ఎప్పుడు ఇస్తారో ఎవరికీ తెలీదు.

ప్రస్తుతానికి ఆ స్థలం చుట్టూ గోడ నిర్మాణంలో వుంది. గోడ కట్టే టెండర్ పొందిన గోల్కొండ బంజారా కన్‌స్ట్రక్షన్ కంపెనీ పని చేపట్టింది.

ఒక రోజు కంపెనీ చీఫ్ ఇంజనీర్ రాజిరెడ్డి చీకటి పడిందంటూ సైట్ నుంచి ఇంటికి బయల్దేరడానికి కారెక్కాడు. కారు ఇంకా స్టార్ట్ కాలేదు. పెద్దరాయి వచ్చి కారు ముందు అద్దం భళ్ళున పగిలింది. డ్రైవర్ షాక్ తిని పెద్దకేక పెట్టాడు. రాజిరెడ్డి బిత్తరపోయి డోర్ తెరుచుకుని పరిగెత్తాడు.

పెద్ద శబ్దం విని అక్కడక్కడ వున్న కంపెనీ సూపర్‌వైజర్లు, మేస్త్రీలు పరిగెత్తుకుంటూ వచ్చారు.

''కారు మీద ఎవరో రాళ్ళు వేశారు'' అన్నాడు ఇంజనీర్ రాజిరెడ్డి కాస్త తేరుకుని.

సెక్యూరిటీ గార్డులు టార్చిలైట్లు వేసుకుంటూ ఆ చుట్టు పక్కలంతా గాలించారు. ఎవరూ కనిపించలేదు. కారు మీద పడిన రాయి పెద్దదే. చాలా దగ్గర్నుంచి విసిరినట్లు కారు అద్దం పగిలిన పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది.

అంత పెద్దరాయి విసిరిన వాళ్ళు వెంటనే ఎక్కడికీపారిపోవడం జరిగేపనికాదు. ఎవరికీ ఏమీ అర్థం కాలేదు. కూలీలు ఎప్పుడో వెళ్లిపోయారు. అక్కడున్నదంతా కన్‌స్ట్రక్షన్ కంపెనీకి చెందిన వారే. కాసేపటికి వాళ్ళూ వెళ్ళిపోతారు. రేకుల షెడ్స్‌లో వున్న సిమెంట్, స్టీలు వగైరా వాటికి కాపలాగా సెక్యూరిటీ గార్డులు మాత్రం వుంటారు.

షాక్ నుంచి తేరుకున్న చీఫ్ ఇంజనీర్ కారెక్కి వెళ్లి పోయాడు.


ఇక ఆ తర్వాత నుంచి చీకటి పడితే చాలు కార్ల అద్దాలు, లారీల అద్దాల మీద రాళ్లు వచ్చి పడుతున్నాయి. అద్దాలు పగులుతున్నాయి. మర్నాడు రిపేరుకి వెళ్తున్నాయి. కార్ల మీదకు రాళ్ళు విసురుతున్న వాళ్లు ఎవరూ కనిపించడం లేదు. అంతా మిస్టరీగా ఉంది.

లోగడ పుల్లలగూడా వూరు అక్కడ వుండేది కాబట్టి, ఆ వూళ్ళో శ్మశాన స్థలం గూడా కంపెనీ ఆక్రమించుకుంది. అందులో వున్న దెయ్యాల పని ఇదని కూలీలు పుకారు లేవదీశారు. చీకటి పడిన తర్వాత మంటలు కనిపిస్తున్నాయనీ, అవి ఖచ్చితంగా కొరివి దెయ్యాలేననీ సెక్యూరిటీ గార్డులు చెప్తున్నారు.

ఇక అప్పట్నుంచి చీకటి పడీపడకముందే కంపెనీ సూపర్‌వైజర్లు, మేస్త్రీలు పారిపోవడం మొదలు పెట్టారు. గోడ పని నత్తనడకతో నెమ్మదిగా సాగుతోంది. ఇట్లాగైతే ఈకాంట్రాక్టులో నష్టం రావడం ఖాయమని కంపెనీ యం.డి. గోలపెట్టాడు.

కొన్నాళ్ళ తర్వాత చిన్న చిన్న రాళ్లు వచ్చిపడసాగాయి పట్టపగలే. ఇక అంతా హడిలిపోయారు. దెయ్యాలు రాళ్ళేస్తుంటే తాము పని చెయ్యలేమని కూలీలు పరిగెత్తారు. ఇంజనీరు బ్రతిమాలి భూతవైద్యుడిని పిలిపించి దెయ్యాల్ని పట్టించి సీసాల్లో బంధించి పాతిపెట్టిస్తానన్నాడు.

ఆ చుట్టు పక్కల చేతబడులు చేస్తారని పేరున్న వాళ్ళని, దెయ్యాల్ని వదలగొట్టే భూతవైద్యుల్ని వూళ్ళ నుంచి పిలిపించారు. వాళ్ళు కోళ్లను కోయించి, మేకల్ని బలిచ్చీ హంగామా చేశారు. ఏవేవో ఎవరికీ అర్థం కాని మంత్రాలు చదువుతూ ఆ స్థలం చుట్టూ పసుపు, కుంకుమ



చల్లి ఇక దెయ్యాలు రావని భరోసా ఇచ్చిపోయారు.

ఆ రోజు వర్షం మొదలైంది. కూలీలు పని ఆపి సర్దుకున్నారు. సైకిల్ మీద ఇంటికి వెళ్లాలని బయల్దేరిన అనంత్ వర్షం ఎక్కువై పోవడంతో ఒక మర్రి చెట్టు క్రిందకు చేరాడు.

అప్పుడు సాయంకాలం ఐదుగంటలు దాటింది. వెలుగు తగ్గిపోతోంది. మబ్బులు కమ్ముకుని వుండడం వలన చీకటిగా వుంది.

సడన్‌గా అనంత్ నెత్తిన చెట్టుపై నుంచి రాళ్ల వర్షం కురిసింది. అనంత్ భయపడి అక్కడ్నుంచి పారిపోయాడు. అన్నీ పలుకురాళ్లే. ఉన్నట్టుండి మీద పడడంతో భయపడ్డాడు గాని స్వతహాగా అనంత్ ధైర్యంగలవాడే. దూరంగా వెళ్లిన తర్వాత అతని బుర్ర పని చెయ్యడం ప్రారంభించింది. తన మీద ఎవరైనా రాళ్ళు వెయ్యదల్చుకుంటే గురిచూసి విసిరే వాళ్ళు. ఆ విసురుకి తనకు దెబ్బతగిలి వుండేది. కాని ఇప్పుడు తన మీద రాళ్ళు వర్షంలా నెమ్మదిగా పడ్డాయి. అంటే ఎవరో చెట్టుమీద రాళ్లను మూట కట్టుకుని కూర్చుని వుండాలి. పొరపాటున మూట విడిపోయి రాళ్ళు క్రిందపడ్డాయి.

అనంత్ ఎలాగైనా ఈ మిస్టరీని ఛేదించాలని నిర్ణయించుకున్నాడు. నెమ్మదిగా చెట్టు దగ్గరికి వచ్చి పైకి చూశాడు. కొమ్మలు, ఆకులు గుబురుగా వుండడంతో ఏమీ కనిపించలేదు. సైకిల్ తీసుకుని కొంత దూరం వెళ్లి ఒక చెట్టు చాటున నక్కాడు.

కాసేపటికి చెట్టుపైనుంచి దిగాడు ఒక కుర్రాడు. వాడికి పదమూడు, పద్నాలుగేళ్ళ కంటే ఎక్కువ వయసు వుండదు. అనంత్ రయ్‌మని సైకిల్ మీద వచ్చి ఆ కుర్రాడిని గట్టిగా పట్టుకున్నాడు.

ఐతే ఆ కుర్రాడు అనంత్‌ని చూసి ఏ మాత్రం భయపడలేదు. పైగా అతన్ని విదిలించి కొట్టాడు. తీవ్రంగా చూశాడు. అనంత్‌కే వాడిని చూసి బెరుకు కలిగింది. ఇంతకీ కొంత కాలంగా తామంతా దెయ్యం చేష్టలనుకున్నది వీడు చేసే కొంటెపనులన్న మాట అనుకుని ఆశ్చర్యపోయాడు.

''ఒరేయ్! మా కార్లమీద, లారీల మీద రాళ్ళేస్తుంది నువ్వేనా?'' అని ప్రశ్నించాడు అనంత్.

''నేనే'' నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు ఆ కుర్రాడు.

''నువ్వేనా? ఇంకా ఎవరైనా వున్నారా?''

''ఎవరూ లేరు నేనే''

''ఎందుకు రాళ్ళెయ్యడం?''

''మీరెందుకు గోడ కడుతున్నారు?''

''ఈ స్థలం మా కంపెనీ కొన్నది''

''ఎందుకు?''

''ఫ్యాక్టరీ కట్టడానికి''

''అది కట్టడానికి మా ఇల్లు పడగొట్టాలా?''

''మీ ఇల్లా? ఎక్కడుంది?''

''గోడ లోపల''

''ఓహోఁ...నువ్వ పుల్లల గూడా వూరివాడివా?''

''ఆఁ... ఇందులో మా ఇల్లుంది''

''మీ ఇల్లు తీసుకుని డబ్బిచ్చారుగా!''

''ఆ డబ్బు మా అన్నలు పంచుకుపోయారు. నాకివ్వలేదు''

''ఏం?''

''చిన్నోడినని అయ్యతీసుకున్నాడు. తాగి పాడుచేశాడు. ఇప్పుడు గుడిసెల్లో వుంటున్నాం.''

''డబ్బు తీసుకుని పాడుచేసుకుంటే ఎవరేం చేస్తారు?''

''డబ్బిచ్చారు. మా ఇంట్లో మామిడి చెట్టుంది జామ చెట్టుంది. బోలెడు కాయలు కాసేవి. కరివేపాకు అమ్మితే ఎప్పుడూ డబ్బు వస్తుండేది. మల్లెమొక్కలు మొగ్గలేసేవి. వాటికేం ఇచ్చారు?''

అనంత్ ఆ కుర్రాడు అడిగిన దానికి సమాధానం చెప్పలేకపోయాడు. కాని వాడెందుకు కంపెనీ కార్లు, లారీల మీద రాళ్ళేస్తూ హడలగొడుతున్నాడో అర్థం చేసుకున్నాడు. ఇప్పుడు వీడిని సెక్యూరిటీ గార్డులకు అప్పజెప్తే కొడతారు. పోలీసులకు అప్పజెప్తారు. ఏం లాభం? వాడి కసి ఎవరికి అర్థమవుతుంది.

''నువ్వు ఎన్ని రాళ్ళేసినా గోడ కట్టడం ఆగదు'' అన్నాడు అనంత్.

వాడే మాట్లాడలేదు. అనంత్ వాడి భుజం మీద చెయ్యి వేసి నడిపించాడు కొంత దూరం.

''మా వాళ్ళంతా ఇన్నాళ్ళూ దెయ్యం రాళ్ళేస్తోందని భయపడుతున్నారు. నువ్వని తెలిస్తే వాళ్ళే దెయ్యాలుగా మారి నిన్ను పీక్కుతింటారు. ఇక ఇటువైపురాకు. ఈ దెయ్యాల కళ్ళ పడకు. సరేనా?'' అన్నాడు అనంత్.

ఆ కుర్రాడు తలవూపాడు. వాడి కళ్లలో కసి అలాగే కనిపిస్తోంది. అది పొయ్యేది కాదు. అది జీవితాంతం వెంటాడుతూ వుండేదే అనుకున్నాడు అనంత్.

ఆ కుర్రాడు వెళ్తున్నవైపే జాలిగా చూస్తూ నిల్చుండిపోయాడు.

**బెస్టాఫ్‌లక్.... భూమిక....**

ఇంగ్లీష్‌లో 'ఎస్' అనే అక్షరానికి నానార్థాలు వున్నా సినిమా ఇండస్ట్రీలో మాత్రం 'ఎస్' అంటే సక్సెస్ అనే అర్థం. తెలుగులో దాదాపు ప్రముఖ హీరోలందరి సరసనా నటించిన భూమిక మొదట్నించి అదృష్టాన్నే నమ్ముకుందట. నా నమ్మకం ఇంత వరకూ వమ్ము కాలేదు అంటున్న భూమిక తను జగపతి బాబుతో కలిసి నటించిన తాజా చిత్రం మీద కూడా బోలెడన్నీ ఆశలుపెట్టుకుందట. ఇద్దరు హీరోయిన్లతో సాగే ఈ చిత్రంలో ఒక హీరోయిన్ అయిన భూమికకు బెస్టాఫ్‌లక్ చెపుదామా...!

